క్లుప్తంగా

జోడో యాత్రతో బీజేపీలో వణుకు

యూత్ కాంగ్రెస్ నేత సర్దార్ ఖాన్



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నేత సర్దార్ ఖాన్

గజ్వేల్: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్రను చూసి బీజేపీ వణుకుతోందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జోడో న్యాయ యాత్రలో బీజేపీ అరాచకాలను రాహుల్‌గాంధీ ప్రస్తావించడం ఆ పార్టీ నేతలకు మింగుడుపడటం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు జూపల్లి లక్ష్మణ్, బాగమొల్ల మల్లేశం, బాలు, అజీం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పాలమాకుల ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా త్రివేణి, ఎంఈఓగా సౌమ్య, గణేశ్, రాహుల్ ఉపాధ్యాయులు వ్యవహించారు. వీరిని హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, మహబూబ్‌అలీ, సంజీవ్, రమణారెడ్డి, పార్థసారథి, హరికృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, కోదండరామ శర్మ, శ్రీనివాసులు అభినందించారు.

ప్రమాదకరంగా మూలమలుపు



ప్రమాదకరంగా పెద్దగుండవెల్లి రోడ్డు మూలమలుపు

దుబ్బాకరూరల్: దుబ్బాక మండలం దుంపలపల్లి–పెద్దగుండవెల్లి సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మలుపులో సూచిక బోర్డు లేకపోవడంతో రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించండి



ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

హుస్నాబాద్: పట్టణంలోని 20వ వార్డు విద్యానగర్‌లోఉన్న ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకుడు మల్లికార్జున్ రెడ్డి, కాలనీ వాసులు బుధవారం డిమాండ్ చేశారు. పట్టణంలో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నా వాటిని తొలగించడంతో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రమాకర స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.

పాఠశాలకు విరాళం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కోమటి రాజవీరు స్మారకార్థం ఆయన కుమారుడు లింగమూర్తి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. బుధవారం మల్లంపల్లి గ్రామంలో పాఠశాల ఎదుట స్వర్గీయ కోమటి రాజవీరు దశమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజవీరు విగ్రహానికి ఎంపీపీ మాలోతు లక్ష్మీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.

అంబేద్కర్ చిత్రపటం పెట్టాలి

చేర్యాల(సిద్దిపేట): గణతంత్ర దినోత్సవంలో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలని అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత కర్రోల్ల నవజీవన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యంగం అమల్లోకి వచ్చి రోజును గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందని, రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ చిత్రపటాన్ని గణతంత్ర వేడుకల్లో పెట్టకపోవడం విచారకరమన్నారు.

ఉద్యోగం ఉన్నా.. భద్రత సున్నా

- ఔట్ సోర్సింగ్‌లో బోరింగ్ మెకానిక్‌లు
- గ్రామ పంచాయతీల నుంచి వేతనాల చెల్లింపు
- తమను క్రమబద్ధీకరించాలని వేడుకోలు



ఈ ఫొటోలోని వ్యక్తి హుస్నాబాద్ మండల బోరింగ్ మెకానిక్ తాళ్లపెల్లి కొమురయ్య. ఈయన హుస్నాబాద్ ఉమ్మడి మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు, 85 శివారుపల్లెల్లో 1996 నుంచి ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తెలంగాణ వచ్చిన తర్వాత మిషన్ భగీరథ పథకంలో పల్లెలకు తాగునీరు సరఫరా చేస్తున్నామని ఇక బోరింగ్‌ల అవసరంలేదని మెకానిక్‌లను ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. దీంతో వారంతా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో మళ్లీ వారిని విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్లు ఆదేశించారు. పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నాడు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వేడుకున్నాడు. ప్రభుత్వం కనికరించి ఉద్యోగ భద్రత కల్పిస్తుందనే ఆశతో ఉన్నాడు. – హుస్నాబాద్‌రూరల్



భల్లునాయక్ తండాలో బోరుకు మరమ్మతు చేస్తున్న మెకానిక్

ఒకప్పుడు గ్రామీణ ప్రజలకు దహార్తి తీర్చే చేతి పంపుల మరమ్మతుల కోసం జిల్లాలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పంపు మెకానిక్‌లను ప్రభుత్వం నియమించింది. జిల్లాల పునర్విభజన జరగడం, పల్లెలకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడంతో అధికారులు వీరితో పని లేదని పక్కన పెట్టారు. అయితే తమను పనిలోకి తీసుకోవాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో వారిని విధుల్లోకి తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 460 మంది ఉంటే సిద్దిపేట జిల్లాలో పది మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.13 వేల చొప్పున వేతనాలను మండల పరిషత్ నుంచి ఇచ్చేవారు. ఇప్పుడు మండల పరిషత్‌లకు నిధులు లేకపోవడంతో అధికారులు తమ దగ్గర డబ్బులు లేవని, పంపు మెకానిక్‌ల అవసరం గ్రామ పంచాయతీలకే ఉందని వారికి నెలకు ఒక పంచాయతీ నుంచి వేతనం ఇవ్వాలని సర్పంచ్‌లను ఒప్పించారు. పంచాయతీలకు నిధులు వస్తే వేతనాలు ఇస్తున్నారు, రానప్పుడు తమ దగ్గర డబ్బులు లేవని సర్పంచ్‌లు మొండికేస్తున్నారు. పనిచేసినా జీతం రావడం లేదని మెకానిక్‌లు ఆందోళన చెందుతున్నారు.

నిధులు కేటాయించాలి

మండల పరిషత్ ఉద్యోగులుగా గుర్తించినప్పుడు మండలం నుంచే మెకానిక్‌లకు వేతనాలు ఇవ్వాలని గ్రామ పంచాయతీల్లో డబ్బులు లేవని కొందరు సర్పంచ్‌లు మొదట అంగీకరించలేదు. నల్లా బిల్లులను వసూలు చేయొద్దని అధికారులు ఆదేశించడంతో పంచాయతీలకు ఆర్థిక వనరులు తగ్గాయని, ప్రభుత్వం ఇచ్చే నిధులు ట్రాక్టర్ల వాయిదాల చెల్లింపులకే సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం మండల పరిషత్‌లకు నిధులు కేటాయించి బోరింగ్ మెకానిక్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రతీనెల వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలి

మండల పరిషత్‌లో డబ్బులు లేనప్పుడు గ్రామ పంచాయతీల నుంచి ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పడంతో ఏడాది కిందట వారికి పంచాయతీల నుంచి వేతనాలు ఇప్పించారు. కొత్త ప్రభుత్వం ఆలోచించి వారికి ఉద్యోగ భద్రతతో పాటు పంపు మెకానిక్‌లను ఒక మేజర్ పంచాయతీలకు కేటాయించి అక్కడే వేతనాలు ఇవ్వాలంటే బాగుంటుంది. మండల పరిషత్‌లకు నిధులు ఇచ్చి వేతనాలు ఇస్తే పంచాయతీలకు భారం తప్పుతుంది. నెల నెల వారికి వేతనాలు అందుతాయి.

– సత్యనారాయణ, ఎంపీఓ, హుస్నాబాద్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: అన్ని రంగాల్లో హుస్నాబాద్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. రూ.కోటి వ్యయంతో మున్సిపల్ నూతన భవన నిర్మాణ మిగులు పనులు చేపట్టాలని, రూ.10 లక్షలతో మినీ స్టేడియం సమీపంలోని స్మశానవాటికలో లైట్లు, ల్యాండ్ స్కేపింగ్, రూ.23 లక్షల తో క్లీన్ నూతన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. మల్లెచెట్టు చౌరస్తాలో వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో మిగులు పనులకు అదనంగా రూ.4.50 లక్షలు కేటాయించాలని తీర్మానం చేశారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 110 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, నూనె, సబ్బులు, పాద రక్షల కొనుగోలుకు రూ.4.90 లక్షల కేటాయింపు, మంచినీటి సరఫరా చేసే బావుల్లో క్లోరినేషన్ కోసం బ్లీచింగ్ కొనుగోలుకు రూ.99 వేలు, పైపులైన్, ట్యాంక్‌ల మరమ్మతులకు రూ.10 లక్షలు కేటాయించాలని పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల–కూటిగల్ గ్రామాల మధ్య గత ఏడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. బుధవారం ఆయన రోడ్డును పరిశీలించిన అనంతరం మాట్లాడారు. వల్లంపట్ల నుంచి కూటిగల్‌కు వెళ్లే బీటీ రోడ్డు కొట్టుకపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయన్నారు. రోడ్డు ధ్వంసం కావడంలో గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు పలుమార్లు వినతులు అందించినా వారు పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న యాదగిరి

ఘనంగా డ్రైవర్స్ డే

హుస్నాబాద్: హుస్నాబాద్ బస్టాండ్‌లో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఒత్తిడికి గురికాకుండా విధులు నిర్వహించాలన్నారు. డిపో అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమని, ప్రతీ ఒక్కరు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

డ్రైవర్ల పాత్ర కీలకం

గజ్వేల్‌రూరల్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల బాధ్యత కీలకమని జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ అన్నారు. డ్రైవర్స్ డేని పురస్కరించుకొని బుధవారం గజ్వేల్ బస్టాండ్ వద్ద ఆర్టీసీ డ్రైవర్లతో పాటు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి చెందిన 108 వాహన డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో 108 వాహన డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై సమావేశం



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్‌డీఓ బన్సీలాల్

గజ్వేల్: ఓటరు జాబితా సవరణపై బుధవారం అన్ని రాజకీయ పార్టీలతో ఆర్‌డీఓ బన్సీలాల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సవరణలపై నాయకుల అభిప్రాయాలను సేకరించారు. ప్రతీ బుధవారం సమావేశం నిర్వహిస్తూ ఓటరు జాబితా, ఇతర అంశాలపై అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పశువుల మందులు అందజేస్తున్న డాక్టర్ శిరీష

గజ్వేల్‌రూరల్: పాడిరైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ డివిజనల్ ఏడీ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని దాచారం గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధులపట్ల రైతులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్య, ఎంపీటీసీ అనురాధ, డాక్టర్ విజయలక్ష్మీ, జేవీవో సాయన్న, వీఏ మహేందర్, పాడి రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ట్రాఫిక్‌రూల్స్ వివరిస్తున్న ఎంవీఐ కవిత



రోడ్డు నిబంధనలు వివరిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సిద్దిపేటజోన్: ప్రతీ ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా గాంధీ చౌరస్తాలో రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, హెల్మెట్ తప్పనిసరి ధరించాలని సూచించారు. ప్రజలు, వాహనదారుల్లో మార్పు వచ్చినప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. జరిమానా వేయడం తమ అభిమతం కాదని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి మాత్రమే జరిమానా వేస్తున్నట్లు తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చేర్యాల మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కవిత అన్నారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాల్లో భాగంగా వాహన దారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్, హోంగార్డు రామేశ్వర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సహజం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్తయ్య

కోహెడరూరల్(హుస్నాబాద్): ఆటలో గెలుపు ఓటములు సహజమని, వాటిని క్రీడా స్ఫూర్తితో తీసుకొని ముందుకువెళ్లాలని సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య అన్నారు. బుధవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. గెలుపొందిన విజేతకు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, మాజీ సర్పంచ్ తాటిపాముల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొక్కుల రమేష్, మాజీ ఉపసర్పంచ్ మంచాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా బాలికల దినోత్సవం



అలిరాజపేటలో మొక్క నాటుతున్న అంగన్‌వాడీ టీచర్ సరిత



అందెలో జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొన్న బాలికలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో జన్మించిన బాలికల ఇళ్ల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కల్పించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): బాలికల హక్కులపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని కేరింగ్ సిటిజెన్ కలెక్టివ్(సీసీసీ) జిల్లా కో ఆర్డినేటర్ సూకూరి ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని అందె ప్రాథమిక, ఉన్నత, అంగన్‌వాడీ పాఠశాలల్లో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారంలో సమాన అవకాశాల కోసం బాలికల హక్కులను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణ, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

గజ్వేల్‌రూరల్: ఆడపిల్లలు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1, 2 ఆఫీసర్స్ కస్తూరిబాయి, డాక్టర్ జయరాజ్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ అనిత అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలను గౌరవించే సమాజం పురోగమిస్తుందన్నారు. మహిళలు, బాలికల విద్య, రక్షణకు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు.

సిద్దిపేటజోన్: సిద్దిపేటలోని బాలసదనంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కేక్ కట్‌చేసి బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ రాజలింగం, డీసీపీఓ రాము, వసతి కేంద్రం నిర్వాహకురాలు రమ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: బాలికలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని దుబ్బాక ఎస్సై గంగరాజు, సీడీపీఓ చంద్రకళ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బాల్యవివాహ చట్టం, విద్యార్థుల చదువుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ అన్నారు. బుధవారం ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలికల దినోత్సవానికి హాజరై మాట్లాడారు. మహిళా సాధికారతలో భాగంగా బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, వివక్ష, అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్వార్డ్, స్నేహిత, భరోసా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం

హుస్నాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేసే కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని బీఎల్వోలు హాజరుకావాలన్నారు.

◆ గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రానికి చెందిన పెద్ద రాజు(40) మర్కూక్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏపీడీ కౌసల్యాదేవి బుధవారం సర్పంచ్ భాస్కర్‌తో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఎంపీటీసీ చైతన్యశంకర్‌రెడ్డి రూ.5 వేలు, శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, తోటి కార్మికులు రూ.10 వేలు సహాయం అందించారు.

◆ పంటల పరిశీలన

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఏఓ నాగేందర్‌రెడ్డి వరి పంటలను పరిశీలించారు. వరికి ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులను పిచికారీ చేయాలని కోరారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామంలో సైబర్ నేరాలు, డ్రంకెన్ డ్రైవ్‌పై బుధవారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ జగదీశ్వర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే వాహనాలు నడిపేవారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని సూచించారు.

◆ ప్లంబర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణ ప్లంబర్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా కేడం లింగమూర్తి, అధ్యక్షుడిగా దానంపల్లి సారయ్య, ప్రధాన కార్యదర్శిగా డప్పు సంపత్, ఉపాధ్యక్షుడిగా ఎండీ యూసఫ్ ఖాన్, కోశాధికారిగా తాడూరి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా కోతి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఓం ప్రకాష్ చారి, ముఖ్య సలహాదారులుగా రాము, ఆంజనేయులు, బాబాతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

◆ యూత్ కాంగ్రెస్ నాయకులకు అభినందన

బెజ్జంకి(సిద్దిపేట): 2023 ఎన్నికలలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ నాయకులను ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సురభిద్వివేది, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పార్టీ కార్యక్రమంలో అభినందించి ప్రశంసా పత్రం అందించినట్లు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శానగొండ శ్రవణ్ తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా యూత్ అధ్యక్షుడు రాహుల్ పాల్గొన్నారు.

◆ కేజీబీవీకి డ్యూయల్ డెస్క్‌లు అందజేత

మద్దూరు(హుస్నాబాద్): కేజీబీవీకి ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా 288 డ్యూయల్ డెస్క్‌లను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం డ్యూయల్ డెస్క్‌లను పంపిణీ చేసిందన్నారు. అనంతరం జాతీయ బాలికాదినోత్సవాన్ని నిర్వహించారు.

◆ మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

కొండపాక(గజ్వేల్): రైతుల మనోభావాలు దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దుద్దెడలో బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు రాజులుగా బతకాలని 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కానీ, అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే ఆ పథకం విషయంలో మంత్రి వెంకటర్‌రెడ్డి హేళనగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రైతులను చులకనగా చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

◆ ఆటోబోల్తా: మహిళకు గాయాలు

దుబ్బాకరూరల్: ఆటో బోల్తా పడటంతో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని హబ్సిపూర్ శివారులో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హబ్సిపూర్ నుంచి ఆటో ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో బోల్తా పడింది. ప్రయాణికురాలు లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ముందుగా అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఉస్మానియాకు తరలించారు.